క్లుప్తంగా

ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి



గోరంట్లలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్‌: ఖరీఫ్‌ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను సెప్టెంబరు 15వతేదీ లోగా ఈ–పంట యాప్‌లో నమోదు చేయించు కోవాలని ఏఓ రవిప్రకాష్‌ సూచించారు. శుక్రవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఏఓ రవిప్రకాష్‌ పర్యటించి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్‌బీకే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఓ మాట్లాడుతూ పంట నమోదు ఉంటేనే ప్రభుత్వం అందజేసే ఉచిత పంటల బీమా, గిట్టుబాటు ధర తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే రైతు సాగు చేసిన పంటలనే ఆర్‌బీకే సిబ్బంది ఈ–క్రాప్‌ నమోదు చేయాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

అంతకుముందు ఏఓ రవిప్రకాష్‌ కోడుమూరులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాకును సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను విక్రయించే ప్రతి దుకాణదారుడు స్టాకును సంబంధించిన రికార్డులను కలిగివుండాలని, వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న వాటిని మాత్రమే రైతులకు విక్రయించాలని ఏఓ సూచించారు.

కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు శుక్రవారం డ్యామ్‌ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం 0.782 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు కోడుమూరులో గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్‌: మండల కేంద్రం కోడుమూరు గ్రామ సచివాలయం–2,5 పరిధిలోని కాలనీల్లో శనివారం ఉదయం, సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌ కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీలు పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

చెరువు కట్ట పునరుద్ధరణ పనులు పూర్తి



పెంచికలపాడులో చెరువుకు వేసిన మట్టి కట్ట

గూడూరు రూరల్‌: కె.నాగలాపురం–పెంచికలపాడు గ్రామాల మధ్యన విస్తరించి ఉన్న చెరువు కట్ట పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. గ్రీన్‌కో కంపెనీ వారు ఒంటిపట్లాలు పొందిన రైతుల నుంచి చెరువు భూములను లీజుకు తీసుకుని కట్టను ధ్వంసం చేసి వదిలి వేశారు. చెరువు కట్టను తొలగించడంతో భారీ వర్షాలకు చెరువు నిండి గ్రామాల్లోకి నీరు వచ్చి గృహాలు జలమయ్యాయని ఆందోళనతో ఈ నెల 21, 22న రెండు గ్రామాల ప్రజలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలకు స్పందించిన ఇరిగేషన్‌ అధికారులు గ్రీన్‌కో కంపెనీ నిర్వాహకులతో మాట్లాడి లీజు ఒప్పందాన్ని రద్దు చేయించి చెరువు కట్ట పునరుద్ధరణ పనులను చేపట్టారు. రెండు రోజులుగా టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకుని రాగా జేసీబీ యంత్రాలతో చెరువు కట్టను ఏర్పాటు చేశారు.

సహకార సంఘానికే స్థలం హక్కు ఉండేలా చూడాలి

కల్లూరు: కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.430/బీ1, డి2, ఎ1, 2బిలోని 20 సెంట్ల భూమిని కల్లూరు సహకార సంఘం కార్యాలయానికి, గోదాముల నిర్మాణానికి కేటాయిస్తూ 1989లోనే కల్లూరు పంచాయతీ బోర్డు తీర్మానం చేసి అప్పటి జిల్లా కలెక్టర్‌ ఆమోదానికి పంపారని కల్లూరు సింగిల్‌ విండో చైర్మన్‌ శివశంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2002లో కల్లూరు పంచాయతీని కర్నూలు కార్పొరేషన్‌లో విలీనం చేశారన్నారు. అయితే ప్రస్తుతం ఈ కాలనీలో సదరు సర్వే నంబరులో ప్లాట్లు వేయడంతో మహవీర్‌ నగర్‌ కాలనీ వెలసిందన్నారు. ఆ కాలనీ ఏర్పడక ముందే కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి స్థలం కేటాయించారన్నారు. ఆ స్థలంలో దారి వేసిన బిల్డర్‌ సహకార సంఘం స్థలాన్ని ఒపెన్‌గా చూపి ప్లాట్లు వేసి అమ్మినారని, ఆ స్థలంపై సంఘానికే హక్కు ఉండేలా చూడాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కోరారు.



ఇ.తాండ్రపాడులో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



కొత్తూరులోని శ్రీవల్లిసుబ్రమణ్యేశ్వర ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



ఇ.తాండ్రపాడు నీలకంఠస్వామి ఆలయంలో..

వరాలతల్లీ..దీవించమ్మా!

- కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

ఓర్వకల్లు/పాణ్యం/ గూడూరు రూరల్‌: శ్రావణ మాసం శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయాలు, అమ్మవారి ఆలయాల్లో పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కథలు వివరించారు. వేలాది మంది ముత్తయిదువులు వారివారి సమీప ఆలయాలకు వెళ్లి అమ్మవారి సమక్షంలో వ్రతాలు ఆచరించారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకోవడంతో పాటు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఓర్వకల్లు మండలంలో ఓర్వకల్లు, హుసేనాపురం, కాల్వబుగ్గ, కాల్వ, పాణ్యం మండలం కొత్తూరు, గూడూరు మండలం కె. నాగులాపురం, కర్నూలు మండలం ఇ. తాండ్రపాడు గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.



కాల్వ మహాలక్ష్మీ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు



కె.నాగలాపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం..



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

గడప గడపకు ప్రభుత్వ పథకాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌

కోడుమూరు రూరల్‌: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా పేదలందరికీ వలంటీర్ల ద్వారా గడపగడపకు చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌ తెలిపారు. శుక్రవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు సమస్యలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామన్నారు. జగనన్న గృహ నిర్మాణ పథకం కింద గృహం మంజూరు చేస్తే పాత ఇంటి స్థానంలో కొత్తది నిర్మించుకుంటామని చెప్పగా, మరికొందరు టీడీపీ హయంలో ఇండ్లు నిర్మించుకున్నా బిల్లులు మంజూరు కాలేదంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అర్హులను గుర్తించి బిల్లులు మంజూరయ్యేలా చూడాలని హౌసింగ్‌ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ వివరాల మేరకు ప్రభుత్వ పథకాలు అందాయా... లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్‌, డీటీ రామాంజనేయులు, పీఏసీఎస్‌ సంజీవరాయ, సర్పంచ్‌ మధుసూదన్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మధుమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, అయ్యన్న, పాపిరెడ్డి, అధ్యగల రాజశేఖరరెడ్డి, లాయర్‌ ప్రభాకర్‌, బలరాం, సుంకన్న, సచివాలయ సిబ్బంది, హెల్త్‌ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చెరువుల కబ్జాపై... విష్ణునే మాట్లాడాలి

అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి 'గుడిసెం గొంజ తన కుటుంబ సభ్యుల పేరున' చెరువులు కబ్జా చేసుకుంటూ తనపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌ ఎద్దేవా చేశారు. గార్గేయపురం చెరువును మనవడిపై రాయించుకుని ఆక్రమించుకునేందుకు విష్ణు ప్రయత్నిస్తున్నారని, అలాగే విష్ణు ఎదురూరులో దేవాలయ భూములను ఆక్రమించుకుని అక్రమంగా పంటలు పండించుకుంటున్నారని, ఇలాంటివేవి తాను వెలికి తీసి బట్టబయలు చేశానన్నారు. చెరువుల కబ్జాపై విష్ణునే మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, కోడుమూరు కోటపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. పార్టీలు, కులమతాలు,వర్గాలు ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ ఫలాలు అందజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్నారన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరు అర్బన్‌ 28వ వార్డు లక్ష్మీపురంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలపై ఆరా తీశారు. నేరుగా సమస్యలు తెలుసుకునే పరిష్కరించేందుకే ప్రజాప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. స్థానికుల వివిధ సమస్యలు ఎమ్మెల్యేకు విన్నవించగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనకు తేడాను గమనించాలని కోరారు. టీడీపీ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సులతో పాటు నాయకుల అనుమతి పొందాల్సిన పరిస్థితి ఉండేదని, నేడు ఆ పరిస్థితి ఏ మాత్రం లేదన్నారు. అర్హత ఉంటే చాలు.. సచివాలయంలో సంప్రదిస్తే మీ ముంగిటకే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. కరోనా మహమ్మారి ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలను కొనసాగించిన ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్యాలో జలను రాష్ట్రంలో ప్రజలందరూ గమనిస్తున్నారని, సరైన సమయంలో మరోమారు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ శేషిరెడ్డి, గ్రామ నాయకులు సత్యంరెడ్డి, సుబ్రహ్మణ్యం, మహేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

కోలుకోలేక ఒకరి మృతి



ప్రమాదంలో మృతిచెందిన జయరాముడు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ వద్ద గురువారం ఓ కారు బోల్తా పడిన సంఘటనలో కోలుకోలేక ఒకరు మృతి చెందారు. గాయాలకు గురైన మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా, దువ్వూరు మండలం, నీలాపురం గ్రామానికి చెందిన జడగొట్టు జయరాముడు(61), కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో కాల్వబుగ్గ వద్దకు రాగానే బేతంచెర్ల మండలం, బైనపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అనే యువకుడు మోటార్‌ సైకిల్‌ను రోడ్డు డివైడర్‌ను ఎక్కించి దాటుతున్నారు. జయరాముడు కుటుంబ సభ్యులు వెళ్తున్న కారు..బైక్‌ను తప్పించబోయి పక్కనే గుంతలో పల్టీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కొడుకు గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

శాంతిరాం ఫార్మసీ కళాశాల వద్ద..

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఫార్మసీ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉస్మాన్‌(64)మృతి చెందినట్లు ఎస్‌ఐ అశోక్‌ శుక్రవారం తెలిపారు. కర్నూల్‌ పట్టణానికి చెందిన మృతుడు ఆర్‌జీఎం స్టూడెంట్స్‌ బస్సుకు క్లీనర్‌గా పని చేస్తున్నారు. బస్సు యూటర్న్‌ చేసుకునే సమయంలో వెనుక నుంచి టిప్పర్‌ వచ్చి ఢీకొనడంతో ఉస్మాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. మృతుడికి భార్య అమినాబీ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బస్సు డ్రైవర్‌ షేక్‌ మస్తాన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం

- భక్తిశ్రద్ధలతో హోమం
- నేడు వాల్మీకి రామాలయం ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ



నూతన శ్రీ వాల్మీకి రామాలయంలో ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సి.బెళగల్‌: మండల కేంద్రం సి.బెళగల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వాల్మీకి రామాలయం ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం వేదపండితులు హోమం నిర్వహించారు. కర్నూలు టౌన్‌ పురోహితులు శ్రీ ముళుకుంట్ల ఆంజనేయ శర్మ పండిత బృంద సభ్యులు సుదర్శనాచార్యుల పర్యవేక్షణలో ప్రాతఃకాల పూజ, శాంతి, మూర్తి హోమములు సాయంకాలం ధాన్యాధివాసము, శయ్యాధివాస అనంతరం మంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ మేరకు శనివారం వాల్మీకి సీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు, నవగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని పెద్దలు తెలిపారు. ఉదయం 5:16 గంటలకు యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠలు, 9:30 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం




సమావేశంలో మాట్లాడుతున్న లోటర్‌బాషా

ఓర్వకల్లు: రాష్ట్రంలో సువర్ణ పాలన, పారదర్శకమైన సంక్షేమ పథకాలు అందాలంటే జగనన్ననే మళ్లీ సీఎం చేద్దామని సచివాలయాల మండల కన్వీనర్‌ లోటర్‌ బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కాల్వ–1,2 సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథుల సమావేశం సర్పంచ్‌ కె.పెద్ద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవినీతిరహిత పాలన అందించాలనే సంకల్పంతో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ వ్యవస్థల బలోపేతం దిశగా కన్వీనర్లు, గృహసారథులను నియమించడమేకాక, వారికి ఉచిత బీమా పథకాన్ని వర్తింపచేయడం సంతోషకరమన్నారు. అదేస్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో కన్వీనర్లు నూర్‌బాష్వా, ఉపసర్పంచ్‌ మహేంద్ర, లక్ష్మణ స్వామి, ఆర్‌బీకే చైర్మన్‌ బాలరంగడు, రఘుల్‌, మల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉలిందకొండలో ఉచిత వైద్య శిబిరం

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో శుక్రవారం ఉచితంగా యునాని వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్‌ వైద్యాధికారి శ్రీనివాసులు, స్వర్ణంధ సేవా సంస్థల ప్రతినిధి మద్దిలేటి, షైన్‌ హోమ్‌ విషన్‌ ధనరాజ్‌ పాల్గొని ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గోరుకల్లుకు తగ్గిన ఇన్‌ఫ్లో



గోరుకల్లు రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

పాణ్యం: మండల పరిధిలో గోరుకల్లు జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. శుక్రవారం సాయంత్రానికి 3,500 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చింది. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో 6టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ నెల 14వ తేదీన బానకచర్ల క్రాస్‌ రెగ్యులేటర్‌ నుంచి గోరుకల్లుకు నీటి విడుదల ప్రారంభమైంది. మొదటి రోజు 5వేల క్యూసెక్కులు రాగా ఆ తర్వాత ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతూ వస్తుంది.

గూడూరు తహసీల్దార్‌గా వెంకటరమణ



గూడూరు: గూడూరు తహసీల్దార్‌ శివశంకర్‌ నాయక్‌ డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ శుక్రవారం గూడూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో శివశంకర్‌ నాయక్‌ డిప్యూటేషన్‌పై వెళ్లారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ





సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపు రెడ్డి మౌర్య, హాజరైన బీఎల్‌ఓలు

- బీఎల్‌ఓల సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జాయింట్‌ కలెక్టర్‌, పాణ్యం అసెంబ్లీ ఎలక్టోరల్‌ రిజిస్ట్రేషన్‌ అధికారి నారపు రెడ్డి మౌర్య ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో నియోజకవర్గంలోని కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం నాలుగు మండలాల సహాయ ఎన్నికల నమోదు అధికారు లు(తహసీల్దార్లు), సూపర్‌వైజర్లు, బూత్‌ లెవల్‌ అధికారులతో ఓటరు జాబితా సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటింటి ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించే నాటికి ఓటరు జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. మరణించిన ఓటర్లను, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల పేర్లు 7 ఫారం ద్వారా తొలగించాలన్నారు. జనవరి 6, 2023 నుంచి మార్చి 31, 2023 తేదీల మధ్య తొలగించిన ఓటర్లను పునః పరిశీలించాలన్నారు. ఓటరు జాబితా ఇంటింటి సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన 17 మంది బీఎల్‌ఓలకు షోకాజ్‌ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం తహసీల్దార్లు రమేష్‌ బాబు, శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున, ఎన్నికల డీటీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్‌ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్‌): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్‌ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్‌ ఆపరేషన్స్‌ ఏడీఈ రమేష్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా బళ్లారి రోడ్డు సెక్షన్‌ పరిధిలోని ఎస్‌బీఐ నగర్‌, ప్రకాష్‌నగర్‌, లెప్రసీ కాలనీ, బోసిరెడ్డి కాలనీ, ఎలుకూరు బంగ్లా, వసుంధర అపార్ట్‌మెంట్స్‌ చుట్టూ ఉన్న ప్రాంతాలు, అలాగే 33 కేవీ నన్నూరు, ఓర్వకల్లు, సంతోష్‌నగర్‌ ఫీడర్లలో చేపట్టనున్న పనుల కారణంగా హౌసింగ్‌ బోర్డు కాలనీ, కమలా నగర్‌, ఆరోరా నగర్‌, బీ. క్యాంప్‌, కిసాన్‌నగర్‌, టెలికాం నగర్‌, గిప్సన్‌ నగర్‌, శ్రీ నగర్‌ కాలనీ, పార్థసారథి నగర్‌, ఏపీఎస్‌పీ కాలనీ, డాక్టర్స్‌ కాలనీ, గణేష్‌ నగర్‌, శ్రీరామ్‌ నగర్‌, రెవెన్యూ కాలనీ, పోస్టల్‌ కాలనీ, జయరాం నగర్‌, చెక్‌ పోస్టు ఏరియా, పోర్ట్‌ క్లాస్‌ ఎంప్లాయీస్‌ కాలనీ, కల్లూరు సెక్షన్‌లోని అబ్బాస్‌ నగర్‌, కృష్ణ నగర్‌, రామకృష్ణ నగర్‌, రామచంద్ర నగర్‌, గుత్తి రోడ్డు పెట్రోల్‌ బంక్‌ ఏరియా, శరీన్‌ నగర్‌, షరీఫ్‌ నగర్‌, అలాగే ఓర్వకల్లు మండలం పల్లి, జీపీ తాండ, గుట్టపాడు, హుసేనాపురం, కాల్వ, బ్రాహ్మణపల్లి, భైరాపురం, సీసీ పల్లి, చింతలపల్లి, లొద్దిపల్లి, మీదివేముల, మంగంపల్లి, ఎన్‌టౌ పాడు, కన్నమడకల, కేతవరం, కొమ్మగిరి, హెచ్‌. కొట్టాల, నన్నూరు, ఓర్వకల్లు, పాలకొలను, పూడిచెర్ల, శకునాల, సోమయాజులపల్లె, తిప్పాయిపల్లి, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి బీపీ మండల్‌



బీపీ మండల్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: దేశంలో వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి బీపీ మండల్‌ అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం మండల్‌ జయంతిని పురస్కరించుకుని పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీపీ మండల్‌ చిత్రపటానికి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఎంపీడీఓ దస్తగిరి మాట్లాడుతూ బీపీ మండల్‌ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆయన పేదప్రజల పక్షాన పోరాడారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, నరసింహారెడ్డి, బషీర్‌, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచండి

- సచివాలయ సిబ్బందికి డీపీఓ ఆదేశం



గడిగరేవుల గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

గడివేముల: ప్రతి గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మంచాలకట్ట, చిందుకూరు, గడిగరేవుల గ్రామాల్లోని సచివాలయాల్లో పాటు చెత్త సేకరణ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ దోమల బెడద పెరగకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే మట్టుపక్కల మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పన్నుల వసూలులో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే ప్రతి గ్రామంలో సాలిడ్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ కింద సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ అబ్దుల్‌ ఖాలీక్‌, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్‌ తదితరులు పాల్గొన్నారు.